మంత్రి పొన్నంను కలిసిన స్థానిక నేతలు



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ బైపాస్ రోడ్డులో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం స్వాగతం పలికారు. భువనగిరిలో ఓ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి పాల్గొనేందుకు వెళ్తుండగా ఘట్‌కేసర్‌లో మంత్రిని కలిసి సన్మానించారు. రాజు, సుధాకర్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం



కీసర: కీసర పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను ఆదివారం నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, బీజేపీ నేతలు కిషోర్, రవీందర్‌రెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు.

కౌన్సిలర్ దంపతులకు..



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో పదవి ముగిసిన రెండో వార్డు కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి మహిపాల్‌గౌడ్ దంపతులను ఎన్ఎఫ్‌సీనగర్ ప్రేమహస్తం ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఐదేళ్ల పదవీకాలంలో కౌన్సిలర్ చేపట్టిన అండర్ డ్రైనేజీ, బీటీరోడ్లు, తాగునీటి పైపులైన్లు ఇతర అభివృద్ధి పనులను గుర్తు చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని ఆకాంక్షించారు. విజయ్ ఎలిజబెత్ పాల్గొన్నారు.

గద్దర్‌ను అవమానించడం సరికాదు



ఘట్‌కేసర్: గద్దర్‌ను ఎంపీ బండి సంజయ్ అవమానించడం సమంజసం కాదని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు దాస్, సభ్యులు దశరథ, రాజేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నర్సింగ్‌రావు, శ్రీనివాసరావు, రమేష్, సత్యం, గోపాల్, జాని, జయంత్, ఆంజనేయులు, శ్రీను, వెంకటేశ్వర్లు, కృష్ణంరాజు, విష్ణు, సచిన్, ప్రవీణ్, అఖిల్, యాకేష్ పాల్గొన్నారు.

మాజీ డిప్యూటీ మేయర్‌కు సన్మానం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటి మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్ ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా 17వ డివిజన్ హనుమాన్‌నగర్ కాలనీ ప్రెసిడెంట్ రాజసింహ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్‌ను ఘనంగా శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జంగేష్, శ్రీహరి, నక్క చందు, పొన్నం చిరంజీవి, వివిధ కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మదర్సాలో హిఫ్జ్- ఏ- ఖురాన్ సభ

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జామియా రియాజుల్ ఇస్లాం మదర్సాలో హిఫ్జ్- ఏ-ఖురాన్ సభను ఆదివారం ఘనంగా నిర్వహించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ వేడుకలకు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ అమర్‌సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మాజీ కార్పొరేటర్ అనంతరెడ్డి, నాయకులు ఇర్ఫాన్, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సందడిగా తరంగ్ వేడుకలు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఉప్పల్ బస్‌డిపో, బోడుప్పల్ శ్రీ చైతన్య హైస్కూల్లో తరంగ్ 20వ, వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ప్రజాకవి గాయకుడు, సినీగేయ రచయిత సురేందర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. సామ అశోక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సామ శోభారాణి, డైరెక్టర్ సామ అభిషేక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మురుగు వెళ్లేందుకు దారేది?

కుంటలు, చెరువులకు చేరుతున్న వ్యర్థాలు
- కలుషితమవుతున్న భూగర్భ జలాలు
- దుర్వాసన, దోమలతో ప్రజల ఇక్కట్లు

పోచారం పుర ప్రజలను డ్రైనేజీ సమస్య పట్టి పీడిస్తోంది. అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను సరిచేయకుండానే పాలక మండలి ఐదేళ్ల పదవీకాలం పూర్తయింది. సమస్య పరిష్కారానికి ఎప్పటికప్పుడు తాత్కాలిక చర్యలు తీసుకున్నారే తప్పా.. శాశ్వత పరిష్కారం చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో వ్యర్థ జలాలు చెరువులు, కుంటలకు చేరుతున్నాయి. వర్షపు నీటితో నిండాల్సిన జలవనరులు మురుగుతో నిండుతున్నాయి. నారపల్లి, అన్నోజిగూడ, పోచారంలోని చెరువులు, కుంటల్లోకి చేరుతున్న మురుగును కట్టడి చేయాలంటే శాస్త్రీయ పద్ధతిలో డ్రైనేజీ వ్యవస్థకు రూపకల్పన చేయాలి. ఆ దిశగా అడుగులు పడాలని ప్రజలు కోరుతున్నారు.

కలుషితమవుతున్న భూగర్భ జలాలు..

మురుగు నీటి వల్ల జలవనరులతో పాటు భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో స్థానిక ప్రజలు అనేక అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు.

భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేక..

పోచారం మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో కొత్త కాలనీలు ఏర్పడుతున్నాయి. వీటిలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు అగచాట్లు పడుతున్నారు. డ్రైనేజీ సమస్య నుంచి ప్రజలకు విముక్తి కలిగించాలని, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధం చేసిన వ్యూహాత్మక మురుగు నీటి ప్రణాళిక ప్రస్తుతం అటకెక్కిందనే ఆరోపణలున్నాయి. అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థపై అధికారులు దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



కుంటలోకి వెళ్తున్న మురుగును చూపిస్తున్న స్థానికులు

కుంటలోకి మురుగు చేరొద్దు..



పోచారంలోని శివాలయం దగ్గర ఉన్న కుంటలో మురుగు కలుస్తోందని ఇటీవల ఫిర్యాదు చేశాం. కుంటను కలుషితం కాకుండా కాపాడేందుకు మురుగు ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– చెరుకు భరద్వాజ్‌గౌడ్, పోచారం

ఎస్‌టీపీ ఏర్పాటు చేసుకోవాలి..



చెరువులు, కుంటల్లోకి మురుగు నీరు చేరకుండా తగిన చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక సమర్పించమని పారిశుద్ధ్య విభాగం అధికారులను ఆదేశించాం. ఇన్ఫోసిస్ క్యాంపస్ సమీపంలోని భవనాలకు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు పట్టాభూమి అడ్డుగా ఉంది. సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) ఏర్పాటు చేసుకోవాలని భవన యజమానులను కోరుతున్నాం.

– కె.వీరారెడ్డి, కమిషనర్, పోచారం మున్సిపాలిటీ

ఆత్మీయ అభినందన సభ



నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

కీసర: నాగారం మున్సిపల్ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం నాగారం మున్సిపల్ పరిధిలోని నేతాజీ నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల పదవీకాలం ముగిసిన మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్‌లను ఘనంగా సత్కరించారు. కాలనీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్, సలహాదారులు కేశవరెడ్డి, ఓదెలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తులో స్కూల్ పాత్ర కీలకం



స్కూల్ వార్షికోత్సవ ముగింపు వేడుకల్లో తోటకూర వజ్రేష్‌యాదవ్ తదితరులు

కీసర: విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దడంలో సెరినిటీ మోడల్ హైస్కూల్ పాత్ర కీలకమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిలు అన్నారు. శనివారం రాత్రి నాగారం మున్సిపాలిటీలోని హైస్కూల్ వార్షికోత్సవ ముగింపు వేడుకల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ రాష్ట్రంలో సెరినిటీ పాఠశాల ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని అభిప్రాయపడ్డారు. తక్కువ ఫీజులతోనే విద్యార్థులకు చదువును బోధించడం అభినందనీయమన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

భవిష్యత్తులో పాఠశాల మరింత ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ రాంరెడ్డి, నాగారం మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, కార్యదర్శి వసంత పాల్గొన్నారు.

ప్లాట్ ఓనర్లు ఐక్యంగా ఉండాలి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఏకశిలానగర్ వెంచర్ వివాదం పరిష్కారమయ్యే వరకు ప్లాట్ ఓనర్లు అందరూ ఐక్యంగా ఉండాలని, ఆ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకు శివారెడ్డి అన్నారు. ఆదివారం నారపల్లిలో జరిగిన ఏకశిలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏకశిలానగర్ వెంచర్ 1985లో ఏర్పడిందని, అప్పటి లేఅవుట్ ప్రకారమే ప్లాట్ల క్రయవిక్రయాలు జరిగాయన్నారు. ప్లాట్లను ముందు ఎవరు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వారికే పూర్తి హక్కులు ఉంటాయన్నారు. వెంచర్‌లోని ప్లాట్లను కబ్జా చేసేందుకు కొందరు వ్యక్తులు చేస్తున్న ప్రయత్నాలను గట్టిగా అడ్డుకుంటామన్నారు. న్యాయవాది జుబేర్ అక్రమ్, కమిటీ సభ్యులు శ్రీనివాస్, ముత్తారెడ్డి, రామిరెడ్డి, ప్లాట్ల యజమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెరుకు శివారెడ్డి

కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



కాలనీ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని శ్రామికనగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మౌలాలి డివిజన్ పరిధిలోని శ్రామికనగర్‌లో ఎమ్మెల్యే సొంత నిధులతో ఏర్పాటు చేసిన శ్రామికనగర్ కాలనీ ముఖద్వారాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కాలనీ అభివృద్ధికి పార్కు స్థలంలో కమ్యూనిటీహాల్ నిర్మించి ఇవ్వాలని శ్రామికనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రణాళికాబద్ధంగా పార్కు స్థలం అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అమీరుద్దీన్, భాగ్యనందరావు, సందీప్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మహ్మద్ గౌస్‌భాయ్, అబ్దుల్ హమీద్, కొంతం శ్రీనివాసరావు, హేమంత్‌కుమార్, అబ్దుల్ రహమాన్, షేక్ కరీం, కొండయ్య, రాంరెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల గడువు పెంపు

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల ఫైన్ ఆర్ట్స్ స్కూల్ (ఎఫ్ఏఎస్)లో ఆరో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ రాము, వైస్ ప్రిన్సిపాల్ రాములు తెలిపారు. వరుస సెలవులు రావడంతో గడువు పెంచామన్నారు. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న బాలబాలికలు ఆరో తరగతిలో చేరేందుకు ఫిబ్రవరి 6లోగా పు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం



జూపల్లి రమేష్ (ఫైల్)

కీసర: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కీసరకు చెందిన జూపల్లి రమేష్ (42) గత కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో కుమార్తె పెళ్లికి డబ్బులు సరిపోకపోవడంతో మనస్తాపానికి గురై గత రెండ్రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేసీఆర్ సోదరికి నివాళులు

మేడ్చల్ రూరల్: మాజీ సీఎం కేసీఆర్ సోదరి సకలమ్మ ఇటీవల మరణించగా కుటుంబీకులు ఆదివారం దశదినకర్మ నిర్వహించారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి పూడూర్‌లోని సుభిషి విల్లాస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్సీ కవిత, కుటుంబీకులు పాల్గొని నివాళులర్పించారు. మేడ్చల్ జిల్లా మాజీ గ్రంథాలయాల చైర్మన్ భాస్కర్‌యాదవ్, గ్రామ మాజీ సర్పంచ్ బాబుయాదవ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ రాష్ట్ర, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

గణపతి ఆలయంలో వసంత పంచమి పూజలు

అల్వాల్: కానాజీగూడలోని మరకత శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో ఆదివారం వసంత పంచమి సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో మూల మంత్ర హోమం, సరస్వతిదేవీ హోమం, అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తి రిమాండ్

ఉప్పల్: రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌లో పట్టపగలు ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలు అమృతమ్మ మెడలో నుంచి బంగారు గొలుసులు ఎత్తుకెళ్లిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమృతమ్మ అనే వృద్ధురాలు నివాసం ఉంటున్న బస్తీలోనే మల్లికార్జున్ (19) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. మల్లికార్జున్ తరచూ.. ఆమె ఇంటికి మనుమడి కోసం వస్తుంటాడు. యథావిధిగా వచ్చిన అతడు ఒంటరిగా నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలోని పుస్తెల తాడును ఎత్తుకెళ్లాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన డీఐ రామలింగారెడ్డి సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి గొలుసును రికవరీ చేసినట్లు పోలీసులు వివరించారు.

‘లక్ష డప్పులు వేయి గొంతులు’ విజయవంతం చేయండి

జవహర్‌నగర్: ‘వేయి గొంతులు, లక్ష డప్పులు’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జవహర్‌నగర్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ అన్నారు. ఈనెల 7న నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని క్రాంతికుమార్, శ్రీను ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ చిరకాల పోరాటం ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతునిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సబ్బండ వర్గాల కులాలు ముక్తకంఠంతో సంఘీభావం తెలుపుదామన్నారు. ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డెపల్లి శివకుమార్, యువజన కాంగ్రెస్ నేతలు వినయ్‌కుమార్, రమేష్, కుమారస్వామి, వెంకటేష్, భాస్కర్, రాజుయాదవ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



జవహర్‌నగర్ ర్యాలీలో కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, ఎమ్మార్పీఎస్ నేతలు

కీసర: ఫిబ్రవరి 7న మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎస్సీ వర్గీకరణ సాధించుకునేందుకు ‘వేయి గొంతులు, లక్ష డప్పులు’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ కళామండలి అధ్యక్షుడు అశోక్, ఎంఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కేశపాగ రాంచందర్‌మాదిగలు పిలుపునిచ్చారు. ఆదివారం కీసర అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ కీసర మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘లక్ష డప్పులు, వేల గొంతుల’ వాల్ పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు. కీసర మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కుమార్ మాదిగ, ప్రధాన కార్యదర్శి కర్రె గణేష్, ఇన్‌చార్జ్ జగన్, మాజీ ఎంపీపీ సుజాత, సంతోష్, శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మార్పీఎస్ నేతలు

వార్షిక క్రీడోత్సవాల ముగింపు వేడుకలు



రామంతాపూర్ : అరవింద్‌నగర్‌లోని విశ్వశాంతి హైస్కూల్‌లో గత రెండు రోజులుగా జరుగుతున్న వార్షిక క్రీడోత్సవాల ముగింపు వేడుకల్లో పరేడ్ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం ముగింపు కార్యక్రమానికి హాజరైన తెలంగాణ మీడియా అకాడమీ సెక్రటరీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి చూపాలన్నారు. క్రీడల్లో శిక్షణ పొంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. తెలంగాణ రాజీవ్ ఆరోగ్యశ్రీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ గిరి, స్కూల్ డైరెక్టర్ వెంకటేశం, ప్రిన్సిపాల్ రూపారాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరువ..

అల్వాల్: విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యం కోసం పట్టుదలతో కృషి చేయడం ద్వారానే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరవచ్చని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ జీకే కాలనీలోని ది ఇండియన్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరై విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కాంగ్రెస్ బీ–బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, చంద్రశేఖర్, ఎస్ఆర్.ప్రసాద్, శంకర్, రాజు, ఇందిరా, యాదగిరి పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌కు సహకరించండి

మల్కాజిగిరి: స్వచ్ఛ భారత్ అమలుకు కాలనీ సంక్షేమ సంఘాలు సహకరించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఆదివారం విష్ణుపురి కాలనీలో పర్యటించిన ఆయన ఇటీవల చేపట్టిన యూజీడీ ప్యాచ్‌వర్క్స్ పనులను పరిశీలించారు. కాలనీలో ఉన్న కొన్ని ఇళ్లు వివాదంలో ఉన్నాయని, వాటి వద్ద చెత్త, చెదారం పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు వారి వివరాలు సేకరించి జీహెచ్ఎంసీకి అందజేయాలని కోరారు. అవసరమైతే జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటుందన్నారు. మూర్తి, పవన్, రవి, రాంమోహన్‌రావు, సోమయాజులు, రమేష్ పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకెళ్లాలి



స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ కోదండరాం

అల్వాల్: మచ్చబొల్లారంలోని ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కోదండరాం హాజరై వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఫోన్‌లో ఆటలు కాకుండా ప్లే గ్రౌండ్‌లోనే ఆటలు ఆడించాలని, వ్యాయామం వంటివి ఇప్పటి నుంచే అలవాటు చేయాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రవి, స్కూల్ ప్రిన్సిపాల్ కవిత, మేనేజర్ ధర్మేంద్ర, జోనల్ హెడ్ రవినాయక్ విద్యార్థులు పాల్గొన్నారు.

వేదిక గణితం పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

బోడుప్పల్: విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వేదిక గణితం పోటీల్లో చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని సిర్వి దివ్య ద్వితీయ బహుమతి గెలుచుకుంది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు పోటీ పరీక్షలు ఎదుర్కొనే విధంగా ప్రత్యేక తర్ఫీదును ఇస్తున్నట్లు వివరించారు. విద్యార్థులకు పోటీతత్వాన్ని నెలకొల్పి తద్వారా గెలుపు స్ఫూర్తిని ఇస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ నీలిమా, వేదిక మాస్టర్ రామారావు విద్యార్థిని దివ్యను అభినందించారు.



పరుపుల గోదాంలో అగ్నిప్రమాదం



ఉప్పల్ : ఉప్పల్‌లోని పరుపుల గోదాంకు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ భగాయత్ శిల్పారామం రోడ్డులో ‘మార్ఫీ కంఫర్ట్ ప్రైవేట్ లిమిటెడ్’ పేరుతో మహ్మద్ ఇస్మాయిల్ అనే వ్యక్తి మరో భాగస్తుడితో కలిసి గత కొన్నేళ్లుగా పరుపుల గోదాంను నడుపుతున్నాడు. ఆదివారం కావడంతో కొనుగోలుదారులు కంపెనీకి నేరుగా వచ్చి పరుపులు తీసుకెళ్తుంటారు. సాయంత్రం కావడంతో కంపెనీలో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని 3 ఫైర్ ఇంజిన్లతో దాదాపుగా 2 గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఉప్పల్ సీఐ ఎలక్షన్‌రెడ్డి, ఇతర పోలీసులు పరిస్థితులు చక్కబెట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.